
సాక్షి ఒడిశా

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,22,740
బంగారం	9 గ్రాములు
వెండి	63 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి

- 8లో



మూగజీవాలపై క్రూరత్వం తగదు

- 8లో

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మినతి బెహర



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మినతి బెహర తదితరులు

బరంపురం: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ మినతి బెహర అన్నారు. ఛత్రపూర్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గంజాం జిల్లా అభివృద్ధి ప్రణాళిక బోర్డు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మహిళా, శిశు రక్షణ చట్టాలపై సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా స్టేట్ వెల్ఫేర్ బోర్డును స్థాపించి చైతన్య శిబిరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. బాలికలకు తక్కువ వయస్సులో వివాహం చేయడం వలన శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ లీనా కుమారి కేషప్, ఒడిశా శిశు అభివృద్ధి కన్సల్టేటర్ డా.టున్నా సాహు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు రాజీవ్‌ర్ డొరా, బి.ఎస్.దుర్గా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తోటలు ధ్వంసం



గంజాయి చెట్లను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బరంపురం: అవిభక్త కొందమాల్ జిల్లాలో గత మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో కలెక్టర్ బృందా ఆదేశాలతో అక్రమంగా సాగు చేస్తున్న వందలాది ఎకరాల్లో గంజాయి తోటలను జిల్లా ఎక్సైజ్ విభాగం అధికారులు, పోలీసులు ధ్వంసం చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం సైతం బల్లిగుడా పోలీసుస్టేషన్ పరిధి కామన్‌కులా అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న వేలాది గంజాయి చెట్లను ధ్వంసం చేసినట్లు ఎస్పీ వినిత్ అగ్రవాల్ తెలియజేశారు.

మీడియా ప్రతినిధులకు 'నో ఎంట్రీ'



శాసనసభ ఆవరణలో పాత్రికేయులను అడ్డుకుంటున్న పోలీసులు

భువనేశ్వర్: బడ్జెట్ సమావేశాల కవరేజీ పురస్కరించుకొని పాత్రికేయులకు చేదు అనుభవం ఎదురైంది. కవరేజీ కోసం విధులకు హాజరయ్యేందుకు విచ్చేసిన మీడియా ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. లోనికి ప్రవేశించకుండా నివారించారు. కరోనా ఆంక్షలతో గత రెండేళ్లుగా మీడియాను అనుమతించని విషయం తెలిసిందే. తదుపరి కోవిడ్-19 ఆంక్షలు తొలగించినా మీడియా ప్రతినిధులకు శాసనసభ ప్రవేశం నివారించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల దృష్ట్యా మంగళవారం నుంచి ప్రారంభమైన బడ్జెటు సమావేశాల నుంచి కవరేజీకి మీడియా వర్గాలను అనుమతిస్తున్నట్లు స్పీకర్ బిక్రమ కేశరి అరూఖ్ సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. మర్నాడు కవరేజీ కోసం హాజరైన పాత్రికేయులకు శాసన సభ ఆవరణలో ఈ రీతిలో అవమానం ఎదురైంది.

సారా అరికట్టేందుకు చర్యలు



సారా బట్టీ వద్ద ఆబ్కారీ సిబ్బంది

జయపురం: స్థానికంగా నాటుసారాను అరికట్టేందుకు ఎక్సైజ్ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. సబ్ డివిజన్‌లో అక్రమంగా సారా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జయపురం సమితి బలియ పంచాయతీ నీలాగుడ గ్రామ ప్రాంతంలో 90 లీటర్ల నాటుసారాతో పాటు, సారా తయారీకి సిద్ధం చేసిన 900 లీటర్ల ఇప్పఊటను సోమవారం ధ్వసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్బాదల్ బిశ్వాల్ వెల్లడించారు. సారా, ఊటల విలువ సుమారు రూ.54 వేలు ఉంటుందని వెల్లడించారు. దాడులు జరగనున్నట్లు ముందుగా తెలియడంతో వ్యక్తులు పారారైనట్లు వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ ఏఎస్‌ఐ ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ రసాభాస

- దివంగత మంత్రి నవ కిషోర్ దాస్ హత్యపై విపక్షాల మండిపాటు
- రాష్ట్రంలో శాంతి భద్రతలపై విమర్శలు
- గవర్నర్ ప్రసంగం సమయంలో నినాదాలు



అసెంబ్లీ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న విపక్ష ఎమ్మెల్యేలు



అసెంబ్లీ సమావేశాలు ప్రారంభిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో మంగళవారం వాడి వేడి వాతావరణం నెలకొంది. 2023-24 ఆర్థిక సంవత్సరపు బడ్జెటు సమావేశాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ శాసనసభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగం ప్రారంభం కావడంతో సభలో వాతావరణం అకస్మాతుగా వేడెక్కింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని కాంగ్రెసు శాసన సభ నాయకుడు నరసింగ మిశ్రా ఆరోపించారు. గవర్నరు ప్రసంగం నిరవధికంగా కొనసాగడంతో కాంగ్రెసు సభ్యులు స్పీకరు పోడియం చుట్టుముట్టారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవ కిషోర్ దాస్‌ని నడి రోడ్డు మీద పట్టపగలు విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది తుపాకీతో కాల్చి చంపిన ఘటన శాంతి భద్రతల లోపానికి నిలువెత్తు తార్కాణమని దుయ్యబట్టారు. ఈ ఘటన విచారణపై కాంగ్రెసు సభ్యులు పలు సందేహాలను లేవనెత్తారు. ప్రభుత్వ చర్యలతో నిరసన తెలియజేస్తూ కాంగ్రెసు సభ్యులు ఆరుబయట ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు.

బీజేపీ నిరసన

రాష్ట్ర మాజీ మంత్రి నవ కిషోర్ దాస్ హత్య సంఘటనపై ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఒక మంత్రి ప్రాణాలకు రక్షణ కల్పించలేని దయనీయ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విపక్ష నేత జయ నారాయణ మిశ్రా ఘాటుగా విమర్శించారు. ప్రభుత్వ పాలన నిర్వీర్యతకు నిరసనగా విపక్ష బీజేపీ సభ్యులు ప్రధాన సభా ప్రాంగణం నుంచి వైదొలగి శాసన సభ లోపలి ప్రవేశ ద్వారం దగ్గర బైఠాయించి నిరసనకు దిగారు. బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని గవర్నరు ప్రసంగాన్ని ఉభయ విపక్షాలు బహిష్కరించి వైదొలగడంతో సభ బోసిపోయింది. తదుపరి సభా కార్యక్రమాలు కొనససాగించేందుకు ప్రతికూల పరిస్థితులు తాండవిస్తున్నట్లు భావించిన స్పీకర్ బిక్రమ కేశరి అరూఖ్ సభా కార్యక్రమాలను బుధవారం ఉదయం 10 గంటల వరకు నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. బడ్జెటు సమావేశాలు తొలి రోజున సభలో తుపాను అలజడి రేపింది.


సంతాపం

అసెంబ్లీలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాప తీర్మానం ప్రతిపాదించారు. ప్రతిపక్ష నేత జయ నారాయణ మిశ్రా, కాంగ్రెస్ పార్టీ నేత నర్సింహ మిశ్రా, ఎమ్మెల్యే లక్ష్మణ్ ముండా సంతాప తీర్మానానికి మద్దతు పలికారు. ఈ నేపథ్యంలో సభలో ముగ్గురు దివంగత సభ్యుల అకాల మరణంపై సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి నవ కిషోర్ దాస్, మాజీ ఎమ్మెల్యే అర్జున్ చరణ్ దాస్, గంగాధర్ దాస్ మృతిపై సభ్యులంతా మౌనం పాటించి నివాళులర్పించారు.

24న బడ్జెట్

శాసనసభలో బడ్జెటు సమావేశాలు రెండు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మార్చి 1వ తేదీ వరకు కొనసాగుతాయి. మలి విడత సమావేశాలు మార్చి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు కొనసాగాల్సి ఉంది. ఈ ఏడాది బడ్జెటు సమావేశాల్లో 27 పని దినాలు కేటాయించారు. ఆర్థిక శాఖ మంత్రి నిరంజన్ పూజారి ఈనెల 24వ తేదీన సభలో బడ్జెట్ ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 27, 28, మార్చి 1 తేదీల్లో బడ్జెట్‌పై చర్చ జరగనుంది. వివిధ స్టాండింగ్ కమిటీలు మార్చి 9, 10, 11, 12వ తేదీల్లో తమ నివేదికలను సభకు సమర్పించనున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే చివరి పూర్తి బడ్జెట్ కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

వరి ఉత్పత్తిలో మొదటి స్థానం: గవర్నర్ గణేషీ లాల్



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్

వరి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో కొనసాగుతోందని గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ తెలిపారు. బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకొని సభలో మంగళవారం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన విజయబాటలో దూసుకుపోతోందన్నారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన, హాకీ పురుషుల ప్రపంచ కప్, మేక్-ఇన్ ఒడిశా కాంక్లేవ్ విజయాలను వివరించారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఒడిశా మిగులు రాష్ట్రంగా కొనసాగడం అభినందనీయమన్నారు. మిల్లెట్ మిషన్ ద్వారా ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. కాలియా స్కాలర్‌షిప్ పథకం కింద ప్రతిభావంతులైన విద్యార్థులకు సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

అంతర్జాతీయ స్థాయిలో క్రీడలకు ఒడిశా రాష్ట్రం ప్రాధాన్యమిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫిఫా అండర్-17 మహిళల ప్రపంచ కప్ 2022 టోర్నమెంట్ నిర్వహణకు భువనేశ్వర్ సంయుక్త ఆతిథ్యం కల్పించడం విశేషమన్నారు. దీంతో ఫుట్‌బాల్ ఆటపై దేశంలో కొత్త ఉత్సాహం వచ్చిందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 43 వేలకు పైగా పాఠశాలలకు ఫుట్‌బాల్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ ప్రపంచ కప్ మ్యాచ్‌లను వరుసగా రెండోసారి నిర్వహించిందన్నారు. హాకీలో ప్రతిభావంతులను వెలికి తీయడంలో రాష్ట్రం విశేషంగా కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రాధాన్యతా పర్యాటక ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. అలాగే రాష్ట్రంలో అత్యల్ప నిరుద్యోగత రేటు ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ నివేదిక పేర్కొంన్నారు.

సీబీఐ విచారణ జరపాలి

- బీజేపీ నాయకుడు జయ నారాయణ మిశ్రా



మాట్లాడుతున్న జయ నారాయణ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో వాతావరణం అకస్మాతుగా మలుపు తిరిగింది. సమావేశాలకు కొద్దిరోజుల ముందు నుంచి దివంగత ఆరోగ్య శాఖ మంత్రి నవ కిషోర్ దాస్ హత్య వెనుక సూత్రధారిని బయటపెడతామని చెబుతున్న ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ నాయకుడు జయ నారాయణ మిశ్రా ఎట్టకేలకు ప్రముఖుల పేర్లు బహిరంగ పరిచారు. ఈ ప్రకటన సభలో తీవ్ర కలకలం రేపింది. మంత్రి నవ కిషోర్ దాస్ హత్య వెనుక 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్, జాజ్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్ దాస్ కుట్రదారులుగా పేర్కొన్నారు. హత్యకు నాలుగు రోజుల ముందు వీరివురు టెలిఫోనిక్ సంభాషణలు జరిపారని, వీరిని విచారించాలన్నారు. కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించాలని కోరారు. దీంతో అధికార పక్షం బిజూ జనతా దళ్ నాయకులు జయ నారాయణ మిశ్రాపై మండిపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన ప్రభాకర్ మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం



మృతుని కుమారుడికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి పుడ్డుని గ్రామం మలుపు వద్ద మోహన బ్లాక్ నుంచి వస్తున్న ప్రభుత్వ వాహనం ఢీకొనడంతో స్థానిక ఏడో మైలుకు చెందిన టి.ప్రభాకర్ (50) మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. పర్లాకిమిడి నుంచి టి.ప్రభాకర్ ఏడో మైలుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో మోహనా బ్లాక్ నుంచి కలెక్టర్ కార్యాలయానికి బయల్దేరిన బీడీవో వాహనం అతివేగంతో పుడ్డుని రోడ్డు మలుపు వద్ద ప్రభాకర్‌ని ఢీకొంది. దీంతో ప్రమాదంలో ప్రభాకర్ మృతి చెందారు. అనంతరం పర్లాకిమిడి ఆదర్శ పోలీసుస్టేషన్ నుంచి ఐఐసీ బివేకానంద స్వయిని విచ్చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ప్రభుత్వ వాహనం నడుపుతున్న డ్రైవర్ తప్పతాగి ఉన్నట్లు సంఘటన స్థలం వద్దనున్న స్థానికులు చెబుతున్నారు. ప్రభాకర్ కుటుంబానికి జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా రెడ్‌క్రాస్ సహాయ నిధి నుంచి రూ.20 వేలు, దహన ఖర్చులకు రూ.2 వేలు, మృతుని కుమారుడికి పొరుగు సేవల ద్వారా ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు జి.తిరుపతిరావు, గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు, ఆర్ఎంసీఎస్ అధ్యక్షులు ఎస్.గజపతిరావు సమక్షంలో హామీ ఇచ్చారు.

• వినూత్న నిరసన



కటక్ జిల్లా మహంగా మండలం ఎర్కానా బజార్ నడి రోడ్డు మీద పాడి రైతులు వినూత్నంగా మంగళవారం ఆందోళనకు దిగారు. ఓంఫెడ్ కంపెనీ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతులు ఆందోళన చేశారు. దీనిలో భాగంగా ఆవు పాలను రోడ్డుపై పోసి నిరసన తెలిపారు. వందలాది మంది రైతులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఇతర పాల కంపెనీల కంటే ఓంఫెడ్ లీటరుకు చాలా తక్కువ ధర చెల్లిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లీటరు పాల ధరను పెంచకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. - భువనేశ్వర్

బొనొకొ లగ్గి నేడు

- తాత్కాలికంగా సర్వ దర్శనం నిలిపివేత

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో బొనొకొ లగ్గి సేవ బుధవారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు 4 గంటల పాటు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు దేవస్థానం వర్గాలు మంగళవారం ప్రకటించాయి. బుధవారం ఫాల్గుణ-శుక్ల తృతీయ తిథి సందర్భంగా మూల విరాటులకు బొనొకొ లగ్గి నిర్వహిస్తారు. దత్త మహాపాత్ర సేవాయత్ వర్గం శ్రీముఖాలను అలంకరిస్తారు. ద్వితీయ భోగ మండపం సేవాదులు ముగిసిన తర్వాత శ్రీముఖ అలంకరణ చేపడతారు. బుధవారం సాయంత్రం 6.00 గంటల నుంచి రాత్రి 10.00 గంటల వరకు ఈ సేవ నిరవధికంగా కొనసాగుతుంది. దీనిలో భాగంగా భక్తులకు సర్వ దర్శనం నిలిపివేయనున్నట్లు అధికారులు తెలియజేశారు.

పుష్ప వికాసం



జిల్లాలోని టికిరిలో ఉన్న ఉత్కళ అల్యూమిన కర్మాగారం ప్రాంగణంలో ఉజ్వల ఉత్కళ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి ప్రదర్శనను ప్రారంభించారు. పర్యావరణం పరిరక్షణ, పరిసర ప్రాంతాల సౌందర్యానికి మొక్కల పెంపకం ఎంతగానో తోడ్పడుతుందని ఆయన తెలియజేశారు. ప్రదర్శనలో వంద రకాల పూల మొక్కలను ఉంచారు. కార్యక్రమంలో ఉత్కళ అల్యూమిన కర్మాగారం యూనిట్ హెడ్ మజూర్ బేగ్, ప్రజా సమాచార, పౌర సంబంధాల శాఖ మేనేజరు లొపముద్ర ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

- రాయగడ











క్లుప్తంగా

బీడీవోగా అనీషా దాస్



రాయగడ: జిల్లాలోని గుడారి బీడీవోగా అనీషా దాస్ నియమితులయ్యారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యాలయం ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దాస్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే గుడారి బీడీవోగా వ్యవహరిస్తున్న నరసింహ చరణ్ శెఠి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

36 కిలోల గంజాయి పట్టివేత



నిందితులను చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో మెడికల్ కూడలి వద్ద ఒక వ్యక్తి బస్తాలో తరలిస్తున్న 36 కిలోల గంజాయిని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న నిందితుడు ధనోనాగ్(31)ను ప్రశ్నించగా ఆంధ్రాలో ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అలాగే నిందితుడు బలిమెలకు చెందిన సురేంద్ర హియాల్ వద్ద గంజాయి కొన్నట్లు తెలుసుకొని అతడిని సైతం అరెస్టు చేశారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం గ్రామ రహదారిపై ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ చేసిన ఘటన నందిగాం మండలంలో కలకలం రేపింది. బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం.. పెద్దబాణాపురానికి చెందిన పైల ఢిల్లమ్మ ఇంటి వద్ద పనులు ముగించుకొని ఉపాధి పని కోసం మంగళవారం తన గ్రామం నుంచి జాతీయ రహదారికి వెళ్లే చెరువు గట్టు రహదారిపై నడుస్తుండగా అదే దారిలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఆమె వెనుక నుంచి వచ్చారు. బండిని కొంచెం ముందు ఆపారు. వెనుక కూర్చున్న వ్యక్తి వేగంగా బండి దిగి ఢిల్లమ్మ మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని బెండిగేటు వైపు రాంగ్‌రూట్‌లో వెళ్లిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మానవ అక్రమ రవాణాకు పాల్పడితే శిక్ష తప్పదు'



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వాళ్లకు కఠిన శిక్షలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆయన మంగళవారం శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవా సదన్‌లో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ అనే నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌తో కలిపి మానవ అక్రమ రవాణా నిర్మూలనపై బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ లా కాలేజీ విద్యార్థులకు, శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మానవ అక్రమ రవాణా నిరోధించడంలో పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగానికి సాధారణ పౌరులు కూడా సహకరించాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత



దాడుల్లో పట్టుబడిన బియ్యం వాహనం

సరుబుజ్జిలి: అక్రమంగా బొలేరో వాహనంలో తరలిస్తున్న 42 బస్తాల పీడీఎస్ రైస్‌ను మంగళవారం వీరభద్రాపురం గ్రామం వద్ద పట్టుకున్నట్లు సివిల్ సప్లయి డీటీ డబ్బీరు రామకృష్ణ మంగళవారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ.76 వేలు ఉంటుందని తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సురేష్ బాబుకు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో బియ్యం రవాణా చేస్తున్న కోటబొమ్మాళి మండలానికి చెందిన బండి సతీష్‌కుమార్, సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన మోణంగి నాగభూషణరావులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని సీజ్ చేసి స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామని వెల్లడించారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ రామారావు, హెచ్‌సీ రామ్మోహన్, పీసీ ఈశ్వరరావు, వీఆర్ఓ ధర్మారావు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి



కృషిమేళాను ప్రారంభిస్తున్న దృశ్యం



పాడి పరిశ్రమపై విద్యార్థుల స్టాల్

- ఒడిశా వ్యవసాయ విద్యాలయం ఉపకులపతి ప్రభాత్ కుమార్ రవుళో

పర్లాకిమిడి: ప్రస్తుతం వాతావరణ మార్పుల దృష్ట్యా ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ విధానంలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఒడిశా వ్యవసాయ విద్యాలయం ఉపకులపతి ప్రభాత్ కుమార్ రవుళో అన్నారు. పర్లాకిమిడి సమీపంలో ఉన్న సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఉత్కళ కృషి మేళాను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో రాగిపిండి, రాగిజావ, మిల్లెట్ బిస్కెట్ల కోసం ధనవంతులు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు. ఎరువులు ఎక్కువ మోతాదులో వాడకం వలన శరీరం అనారోగ్యాల బారిన పడుతుందని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన కాయగూరలు తినడం వలన సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు 45 వివిధ వ్యవసాయ, యంత్ర పనిముట్లు స్టాల్స్‌ను ప్రారంభించారు.

అంతరిస్తున్న తేనెటీగలు

దేశంలో తేనెటీగల సంతతికి ముఖ్యమైన రాణి తేనెటీగల సంఖ్య తగ్గిపోతోందని కృషి జాగరణ్ చీఫ్ ఎడిటర్ నట్వర్ సారంగి ఆందోళన వ్యక్తం చేశారు. గ్లోబల్ వార్మింగ్ వలన తేనెటీగలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వెల్లడించారు. ఒడిశాలోని బర్ఘడ్ జిల్లాలో ఎక్కువ మంది ప్రజలు కేన్సర్ బారినపడడానికి కారణం అక్కడ రైతులు ఎక్కువగా క్రిమి సంహారిక మందులు, ఎరువులు ఉపయోగించడమేనని పేర్కొన్నారు. ఎంఎస్ స్వామినాథన్ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఎం.దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కృషి మేళా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

కార్యక్రమంలో కృషి జాగరణ్ టీవీ ఛానల్ ఎంసీ డామినిక్ మాట్లాడుతూ, సెంచూరియన్ వర్సిటీ డీన్ (అకడమిక్) డాక్టర్ అనితా పాత్రో, స్వామినాథన్ అగ్రికల్చర్ బీఎస్సీ డీన్ ఎస్పీ నందా తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ యంత్ర సామగ్రి ప్రదర్శన



కృషిమేళాకు విచ్చేసిన రైతులు, వివిధ వర్సిటీల అధ్యాపకులు, పరిశోధకులు

చిరుధాన్యాలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రశాంత పరిడ

జయపురం: చిరుధాన్యాలతో సంపూర్ణం ఆరోగ్యం లభిస్తుందని ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ శాస్త్రవేత్త ప్రశాంత పరిడ అన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జయపురం కార్యాలయ ప్రాంగణంలో జయపురం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఫుడ్ స్టోరేజ్ డిపార్ట్‌మెంట్ ఉమ్మిరి, ఆత్మ కొరాపుట్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ 2023 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వలన ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జయపురం ఏజీఎం ప్రతాప్ కుమార్ మెహర అధ్యక్షతనగా జరిగిన కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు మేనేజర్ తాపస్ చంద్రరాయ్, ఆల్ ఇండియా రేడియో జయపురం స్టేషన్ డైరెక్టర్ నరేంద్ర పట్నాయిక్, రాయగడ ఏసీఎస్‌వోలు సీహెచ్.మురళీ కృష్ణ, ఎస్ భోయి, జయపురం ఏసీఎస్‌వో సుశీల్ కుమార్ జెన, మల్కన్‌గిరి జిల్లా ఓఎస్‌సీఎస్‌సీ లిమిటెడ్ మహేంద్ర కుమార్, నవరంగపూర్ ఓఎస్‌సీఎస్‌సీ లిమిటెడ్ అకౌంటెంట్ నీలు మహారాణ, ఎఫ్‌సీఐ అధికారులు, ఉమ్మిరి, నవరంగపూర్, రాయగడ ఫుడ్ స్టోరేజ్ డిపార్ట్‌మెంట్స్ ప్రతినిధులు, జయపురం మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు రైతులు

పాతపట్నం: రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, నూతన పంటల పద్ధతులను అలవర్చుకోవాలని హార్టికల్చర్ అధికారి మంగమ్మ అన్నారు. స్థానిక నీలమణి దుర్గ ఆలయం వద్ద పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట మండలాలకు చెందిన రైతులు మంగళవారం విజ్ఞాన యాత్రకు బస్సులో హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. బ్రెడ్స్ సంస్థ, నాబార్డు ఆధ్వర్యంలో రైతులకు కాట్ శిక్షణ కోసం ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసోర్సు సంస్థకు వెళ్లనున్నట్లు 'బ్రెడ్స్' ప్రతినిధి సాంబమూర్తి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు మేనేజర్ చంద్రరావు, బి.ఆనంద్, సంతోష్ కుమార్, జనార్ధనరావు, నవీన్ పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో సంప్రోక్షణ పూజలు



శ్రీముఖలింగం ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు అనంతరం మంగళవారం ఉదయం సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యాహవచన పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు, అధికారులు పుణ్యతీర్థాల జలాలు, పంచగవ్యంతో శుద్ధి చేశారు. ఉదయం ఈ సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి ప్రత్యేక పూజలు, అర్చనాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతినిచ్చారు.

నేత్రపర్వంగా మల్లన్న చక్రతీర్థ స్నానాలు



చక్రతీర్థ స్నానాలు అనంతరం భ్రమరాంబ సమేత మల్లన్న ఉత్సవ మూర్తులు

టెక్కలి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం చక్రతీర్థ స్నానాలు నేత్ర పర్వంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్య నిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ సర్లాన సుధాకర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ నేతృత్వంలో ముందుగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవ మూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం మల్లన్న ఆలయం ప్రాంగణంలో గల సీత కోనేరులో ఉత్సవ మూ ర్తులకు చక్రతీర్థ స్నానాలు చేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణ, మోహనరావు, యుగంధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

తెలుగు భాషకు ప్రత్యేకం 'అవధానం'



అవధాని మీగడ రామలింగస్వామిని సన్మానిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: అవధాన ప్రక్రియ తెలుగు భాషకు ప్రత్యేకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో మంగళవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా సంగీత సవావధానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ అవధాని మీగడ రామలింగస్వామి పాల్గొని అవధానం నిర్వహించారు. పలువురు ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలిచ్చారు. గయోపాఖ్యానం, పాండవ ఉద్యోగ విజయాలు, సత్య హరిశ్చంద్ర పద్యాలను వినిపించారు. 2006 నుంచి తాను సంగీత అవధాన ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు.

ప్రస్తుతం విద్యార్థుల్లో వక్తృత్వ వికాసం అవసరమని తెలిపారు. క్రమశిక్షణతో లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ చౌదరి తేజేశ్వరరావు, తెలుగు విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఉమ్మడి శాంతి, విభాగ సమన్వయకర్త డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

మూగజీవాలపై క్రూరత్వం తగదు



మాట్లాడుతున్న కలెక్టర్ సింగ్, వేదికపై బెహర, భొయ్



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: మూగజీవాలపై క్రూరత్వం తగదని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా వెటర్నరీ విభాగం అధ్వర్యంలో ఆ శాఖ అధికారి డాక్టర్ హడిబంధు భొయి అధ్యక్షతన జరిగిన ప్రివెన్షన్ అఫ్ క్రూయల్టీ టు యానిమల్స్ అంశంపై మంగళవారం జరిగిన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూగజీవాలను హింసిస్తే ప్రత్యేక చట్టం కింద శిక్షపడుతుందని హెచ్చరించారు. రాయగడలో గో శాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఎటువంటి అనుమతులు లేకుండా మూగజీవాలను ఇతర ప్రాంతాలకు తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌డీపీవో దేవజ్యోతి దాస్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహర తదితరులు పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త హతం

- సోదరుడితో కలిసి భర్తను హత్యచేసిన మహిళ
- వేధింపులు తాళలేకే దాడి



మృతుడు చంద్రభూషణ్



రోదిస్తున్న చంద్రభూషణ్ బంధువులు

నరసన్నపేట: మద్యం మహమ్మారి మరో కుటుంబాన్ని నిలువునా బలి చేసింది. రోజూ తాగి వచ్చి వేధించే భర్త తీరును భరించలేక ఓ మహిళ ఏకంగా అతడిని హత్య చేసింది. అందుకు తన సోదరుడి సాయం తీసుకుంది. నరసన్నపేట మండలం పెద్దకరగాంలో మంగళవారం జరిగిన ఈ హత్య స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

పెద్దకరగాంకు చెందిన ఇర్రి చంద్రభూషణ్(37)కు పదేళ్ల కిందట తోటపాలేంకు చెందిన భాగ్యలక్ష్మితో వివాహమైంది. వీరికి మాధురి, లాస్య అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చంద్రభూషణ్ తాగుడుకు బానిసైపోయాడు. ఇతర వ్యసనాలు కూడా ఉండడంతో నిత్యం భార్యను వేధించేవాడు. ఈ గొడవ గ్రామంలో పెద్ద మనుషుల వరకు కూడా వెళ్లింది. రచ్చబండలో సంప్రదింపులు జరిగాయి. అయినా చంద్రభూషణ్‌లో మార్పు రాలేదు. వారం కిందటే భార్యాభర్తలు మళ్లీ గొడవపడ్డారు. దీంతో భాగలక్ష్మి తన కన్నవారింటికి వెళ్లిపోయింది. రెండు రోజుల కిందటే భర్త వద్దకు వచ్చింది. వచ్చిన రోజు రాత్రి మళ్లీ వివాదం జరిగింది. దీంతో పోలీసులను ఆశ్రయిస్తే వారు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పటికీ చంద్రభూషణ్ మారలేదు.

సోదరుడిని పిలిచి..

మంగళవారం కూడా తాగి ఇంటికి వచ్చిన చంద్రభూషణ్ మళ్లీ భార్యతో ఘర్షణకు దిగాడు. దీంతో ఆమె తన సోదరుడు శివకు ఫోన్ చేసి ఇంటికి పిలిచారు. అతను వచ్చాక మద్యం మత్తులో ఉన్న చంద్రభూషణ్‌పై కర్రలు, మంచం కోళ్లతో దాడి చేసి విపరీతంగా కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక చంద్రభూషణ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే శివ పారిపోకుండా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సంఘటన తెలుసుకున్న నరసన్నపేట సీఐ డి.రాము, ఎస్ఐ సింహాచలంలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు గల కారణాలను స్థానికుల నుంచి సేకరించారు. వీఆర్వో గవరయ్య, గ్రామ పెద్దమనుషుల మధ్య శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం కేసు నమోదు చేయగా.. సీఐ రాము దర్యాప్తు చేస్తున్నారు.

సత్తాచాటిన సిక్కోలు క్రీడాకారులు



నందిని, గాయిత్రిలను అభినందిస్తున్న ఏఆర్ డీఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తాచాటారు. రజత పతకాలు సాధించి శభాష్ అనిపించారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల వేదికగా ఈ నెల 16 నుంచి 20 వరకు 41వ ఆలిండియా సబ్-జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-23 పోటీలు జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు అత్యద్భుతంగా రాణించింది. తమిళనాడుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బెస్ట్‌ఆఫ్ త్రీలో స్వల్ప తేడాతో తమిళనాడు విజేతగా నిలవగా, ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఇద్దరు సిక్కోలు క్రీడాకారులు సింగూరు నందిని(లింగాలపేట), ముంత గాయిత్రి(ఎచ్చెర్ల) కీలకపాత్ర పోషించి రజత పతకాలు సాధించారు. నందిని ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాల ఎచ్చెర్లలో 10వ తరగతి చదువుతుండగా, గాయిత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎచ్చెర్లలో 10వ తరగతి చదువుతోంది. వీరిని మంగళవారం ఏఆర్ డీఎస్పీ ప్రసాదరావు అభినందించారు. జిల్లాకు, రాష్ట్రాన్ని గౌరవాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. నగదు బహుమతిని అందజేసి సంఘ ప్రతినిధులను, కోచ్ మధుసూదన్‌ను అభినందించారు.

13న పోలీస్ వాహనాలు వేలం

ఎచ్చెర్ల క్యాంపస్:

మార్చి 13న పోలీస్ వాహనాలు వేలం వేయనున్నట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్సులు-2, టాటా సుమోలు-3, కమాండర్ జీపులు -5, మహీంద్రా జైలో-1, టయోటా ఇన్నోవా-1, టాటా స్పేసియస్-4, ఆల్టో కారు-1, మోటార్ సైకిల్స్-9 వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మార్చి 13న ఉదయం 11 నుంచి 5 గంటల వరకు వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. మార్చి 10న వాహనాల పరిశీలనకు ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం మోటార్ వెహికల్ విభాగంలో అనుమతిస్తామని తెలిపారు.

పోర్టల్ ఆఫ్ ఏపీ గవర్నమెంట్ వెబ్‌సైట్‌లో ఈ -ఆక్షన్‌లోనూ పాల్గొవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు యూనిట్ మెకానిక్ (9989074783), రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (6309990841), డీఎస్పీ (6309990813)లను సంప్రదించవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్‌కు తీవ్ర గాయాలు

- సొంత వాహనంలో ఆస్పత్రికి పంపించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రం పాతపట్నంలోని అచ్యుతాపురం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వలంటీర్ వట్టికుల ప్రకాశరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మెళియాపుట్టి మండలం కె.మత్రిపాడుకు చెందిన వలంటీర్ ప్రకాశరావు మెళియాపుట్టి నుంచి ఆల్‌ఆంధ్ర రోడ్డు మీదుగా అచ్యుతాపురం వస్తున్నాడు. అచ్యుతాపురం వద్దకు వచ్చే సరికి ఎదురుగా పర్లాకిమిడి (ఒడిశా) నుంచి ద్విచక్ర వాహనదారుడు పరస్పరం ఢీకొనడంతో ప్రకాశరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడ్ని పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు. సూపరింటెండెంట్ వై.సురేంద్రకుమార్ ప్రథమ చికిత్స అందించారు. కాలికి తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి రిఫర్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆస్పత్రికి వెళ్లి తన సొంత కారులో వలంటీర్‌ను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. ఫోన్‌లో వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, కొసమాల పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, నాయకులు పల్లి యోగి ,లింగాల సంజీవరావు, అలికాన మాదవరావు, సవర సుభాష్, దువ్వాడ బాలరాజు, రవికుమార్, శామ్యూల్ పాల్గొన్నారు. కాగా, ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

సచివాలయ పోలీస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జయశ్రీ


కొటాన జయశ్రీ

విజయనగరం క్రైమ్: సచివాలయ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ రాష్ట్ర ప్రెసిడెంట్‌గా కొటాన జయశ్రీ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అడహక్ కమిటీ అధ్యక్షురాలు ఎస్.మహాలక్ష్మి (తిరుపతి), ప్రధానకార్యదర్శి డి.మధులత (గుంటూరు)లు తనను ఎంపిక చేశారని పేర్కొన్నారు. మహిళా పోలీసుల సమస్యల పరిష్కారం, సంక్షేమం ధ్యేయంగా ఏపీ మహిళా వెల్ఫేర్ అసిసియేషన్‌ను స్థాపించామన్నారు. మహిళా సంరక్షణ పోలీసుల సమస్యలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషిచేస్తామని చెప్పారు. జిల్లా నుంచి రాష్ట్ర వర్కింగ్ కమిటీలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జయశ్రీ ఎంపికవ్వడంతో జిల్లాలోని మహిళా సంరక్షణ పోలీసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్పీపై దర్యాప్తు ప్రారంభం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన మెప్మా ఆర్పీపై జిల్లా అధికారులు దర్యాప్తు ప్రారంభించారని మెప్మా టీఎంసీ ఎస్‌పీ రత్నం మంగళవారం తెలిపారు. మెప్మా పీడీ ఆదేశాల మేరకు జిల్లా మెప్మా కార్యాలయం నుంచి కేఎస్ శ్రీనివాసరావు, బి.కిశోర్‌బాబు, ఎం.కృష్ణలను దర్యాప్తు బృందంగా ఏర్పాటయ్యారన్నారు. వారు అవకతవకలకు గురైన గ్రూపు సభ్యుల వద్ద మున్సిపాల్టీలోని మెప్మా కార్యాలయంలో పూర్తిస్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ప్రతి గ్రూపు సభ్యురాలు లావాదేవీలకు సంబంధించి పుస్తకాలు తీసుకురావాలని, రోజుకు రెండు గ్రూపులను తనిఖీ చేయనున్నామన్నారు. ఇదిలా ఉండగా అక్కడికి హాజరైన సభ్యులు తమ గ్రూపుల్లో అవకతవకలు జరిగాయని అధికారులకు వివరించారు. గ్రూపుసభ్యుల వద్ద రికార్డులు లేకపోవడంతో బ్యాంకు నుంచి స్టేట్‌మెంట్‌లు తీసుకురావాలని దర్యాప్తు అధికారులు తెలిపారు. తనిఖీ చేయనున్న గ్రూపులకు సంబంధించి ముందుగానే సమాచారం ఇస్తామని తెలిపారు. శివజ్యోతి గ్రూప్‌కు సంబంధించి అవకతవకలకు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. బ్యాంకు లింకేజీలకు సంబంధించి ఆర్పీ ఇచ్చిన ఫొటోలు, సంతకాలకు పొంతన లేకపోవడంతో ఫోర్జరీగా నిర్ధారించారు. అనంతరం ఆర్పీ శారదను పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక తయారుచేశామని తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న లక్ష్మి

పార్వతీపురం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ మేరకు పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం ఇందిరానగర్‌కు చెందిన కె. లక్ష్మి కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు, రెండవ కుమార్తె పెందుర్తిలో నర్స్ ట్రైనింగ్ చేస్తోంది. చదువుకోసం డబ్బులు పంపించాలని కూతురు కోరడంతో డబ్బులు లేక మానసికంగా కుంగిపోయి ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయం చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

విద్యుత్ షాక్ తగిలి వ్యక్తికి గాయాలు

పార్వతీపురం: బొబ్బిలి మండలం పాతపెంట గ్రామానికి చెందిన ఎన్.సత్యనారాయణ విద్యుత్ షాక్ తగిలి గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఇంటి సీలింగ్ వర్క్ నిమిత్తం పార్వతీపురంలోని వైకేఎం కాలనీలో ఆయన పనిచేస్తున్న సమయంలో మేడమీదకు మెటీరియల్ తీసుకువెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి కిందపడిపోయాడు. వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుణ్యగిరి ఆదాయం రూ.16లక్షలు


పుణ్యగిరిలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు

శృంగవరపుకోట: పుణ్యగిరి ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వై.వి.రమణి, దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.5,77,478లు, దర్శనం టిక్కెట్ల అమ్మకంతో రూ.8,20,065లు, ప్రసాదాల విక్రయాల వల్ల రూ.1,93,480లు ఆదాయం లభించింది. విరాళాల రూపంలో వచ్చిన ఆదాయం తగ్గింది. గతేడాది రూ.56,979లు రాగా, ఈ ఏడాది రూ.21,032లు మాత్రమే వచ్చింది. గతేడాది మహాశివరాత్రి జాతర సమయంలో రూ.12,43,378లు రాగా, ఈ ఏడాది రూ.16,12,055లు సమకూరినట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. భక్తులు హుండీలలో వేసిన వెండి, రాగి, బంగారం తూకం వేయాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ వై.వి. రమణి చెప్పారు. కార్యక్రమంలో ఈఓ కె.నాగేంద్ర, బోర్డు డైరెక్టర్లు, దేవదాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

టెస్టింగ్ సెంటర్ ఉందిగా.. నకిలీల బెడద ఉండదిక

- విత్తనాలు, ఎరువుల పరీక్షలతో రైతులకు సర్కారు అండ
- నియోజకవర్గానికి ఒక వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్
- అన్నదాతలకు ఉపయోగకరం


సాలూరులో నిర్మాణమవుతున్న వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్

సాలూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరో నూతన కార్యక్రమానికి అడుగులు పడ్డాయి. నకిలీ విత్తనాలు, ఎరువులతో పంట నష్టపోతున్న రైతులకు అటువంటి దుర్భర పరిస్థితులు రాకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే పరీక్షించే విధంగా వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్‌కు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు లభించేలా ఈ ల్యాబ్‌లు కీలక పాత్ర పోషించనున్నాయి.

ఒక ల్యాబ్‌కు రూ.55లక్షలు

వైఎస్సార్ అగ్రిటెస్టింగ్‌ల్యాబ్స్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా సుమారు రూ.55 లక్షలతో ఒక్కో భవన నిర్మాణం చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో జరుగుతున్న భవన నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయని అధికారులు చెబుతున్నారు.

చేరుకుంటున్న పరికరాలు

అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌లో విత్తనాలు, ఎరువులు, భూసారం తదితర పరీక్షలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఈ పరీక్షలకు కావాల్సిన లక్షలాది రుపాయల విలువ చేసే పరికరాలను ప్రభుత్వం ఈ కేంద్రాలకు పంపిస్తోంది. మార్కెట్లోకి వచ్చే ప్రతి ఇన్‌పుట్ శాంపిల్‌ను రైతులు ఇక్కడ పరీక్షించుకునే వెసులుబాటు ఉండడం వల్ల నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో సాగు చేయడం వల్ల మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల బెడద నుంచి రైతులకు ఉపశమనం కలగనుంది. రైతులు పండించిన పంటల నుంచి సొంతంగా తయారుచేసుకున్న లేదా మార్కెట్లో కొనుగోలు చేసుకున్న విత్తనాలను ఈ ల్యాబ్‌కు వెళ్లి ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనాలతో పాటు ఎరువులు, పురుగుల మందుల నాణ్యతను పరీక్షించుకోవచ్చు.

రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానం

రైతులకు అన్ని రకాల సేవలను గ్రామాల్లోనే అందిస్తున్న రైతుభరోసా కేంద్రాలను వైఎస్సార్ అగ్రిటెస్టింగ్‌ల్యాబ్స్‌కు అనుసంధానం చేయనున్నారు. ఈ పరీక్షలను ప్రత్యేక నిపుణులు చేస్తారు. అత్యాధునిక పరికరాల ద్వారా చేసే ఈ పరీక్షలు రైతులకు ఎంతో లాభసాటిగా మారనున్నాయి. వాటిపై రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించి, ఈ ల్యాబ్స్‌లో పరీక్షలు చేసుకునే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ల్యాబ్స్ ఉపయోగకరం

జిల్లాకు నాలుగు వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్ మంజూరయ్యాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల నాణ్యతను రైతులు పరీక్షించుకోవచ్చు. ఇది వారికి ఎంతో ఉపయోగకరం. ముఖ్యంగా నకిలీ విత్తనాలు, ఎరువుల నుంచి రైతులకు ఉపశమనం కలుగుతుంది. త్వరలో ఇవి ప్రారంభమవుతాయి.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

కనులకు అందం.. కవలల బంధం

- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం


జయ.. విజయ


తన్మయి.. తనూజ


జయంత్.. జశ్వంత్

రాజాం/రాజాం సిటీ/రేగిడి/వంగర: అశ్వినీ దేవతలు, లవకుశలు, నకుల, సహదేవులు కవలలని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి. ఒకే రూపంతో ఉండే కవలలంటే ఇష్టపడని హృదయం ఉండదు. సహజత్వంతో ఉండే కవలల కోసం ప్రతి ఏడాది ఫిబ్రవరి 22న కవలల దినోత్సవం జరుపుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఈ కవలలు కలుసుకునే కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. గతంలో ఎక్కడో కనిపించే కవలలు నేడు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నారు. కవలల రూపం ఒకేలా ఉంటుంది కానీ, అభిరుచులు కొందరిలో ఒక్కొక్కరివి ఒక్కోలా ఉంటాయని, ఒక్కో జంటలో ఒకేలా ఉంటాయని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలోని కవలలకు శుభాకాంక్షలు తెలియజేద్దాం.


శివ, అయ్యప్ప


రాము.. లక్ష్మణ


జాహ్నవి, జగతి


చందన్.. చరణ్


సాయికార్తీక్, సాయిశ్రీ


హర్షిత్, హస్మిత్


దనుశ్రీ, ధనుష్

ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: ఈ నెల 26 నుంచి జరగనున్న ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ అన్నారు. ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలకు ఎగ్జామినర్‌లుగా వ్యవహరించే లెక్చరర్లకు మంగళవారం జరిగిన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష విధుల నిర్వహణ సమయంలో ప్రభుత్వ నింబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సంవత్సరం ఇంటర్‌మీడియట్ పరీక్షలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతాయన్నారు. ప్రతి కళాశాలలో ల్యాబ్‌లను పరిశీలించామని, అన్ని సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వృత్తివిద్యాధికారిణి మంజులవీణ, డీఈసీ సభ్యుడు జగన్నాథరావు, ఎస్. రామకృష్ణ, హైపవర్ కమిటీ సభ్యుడు వై.నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ అకుల రాజు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ అధ్యాపకులు పాల్గొన్నారు.

సారా రవాణాపై దాడులు

పార్వతీపురం: ఒడిశా నుంచి పార్వతీపురం మున్సిపాల్టీ కొత్తవలసకు సారా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో పార్వతీపురం మున్సిపాల్టీ సూర్యపీఠం సమీపంలో గల పొలాల్లో కాపుకాసి 800లీటర్ల సారాను సీజ్ చేసి జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎల్.ఉపేంద్ర మంగళవారం తెలిపారు. ఒడిశాలోని మెల్లక ముత్యాలు వద్ద సారాను కొనుగోలు చేసి పార్వతీపురం, వీరఘట్టం ప్రాంతాల్లోని ఐదుగురికి సరఫరా చేసేందుకు కూలీల ద్వారా కాలినడకన తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ మేరకు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అరెస్టు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ధ్యేయం

- రీ సర్వే ఎ.డి త్రివిక్రమరావు


మాట్లాడుతున్న భూ సర్వే ఎ.డి త్రివిక్రమరావు

రామభద్రపురం: సుదీర్ఘ కాలంగా ఉన్న భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వైఎస్ఆర్ శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 179 గ్రామాలలో సర్వే పూర్తయిందని రీ సర్వే ఎ.డి టి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు, రీ సర్వే డీటీ ఉమామహేశ్వరితో సమావేశమై మండలంలో జరుగుతున్న రీ సర్వేపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మొదట దశలో చేపట్టిన భూ రీస్వేలో 179 గ్రామాలలో పూర్తి చేయగా సుమారు 877 గ్రామాలలో డ్రోన్‌ఫ్లై, 350 గ్రామాలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశామన్నారు.ఈ సర్వేను 480 మంది మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, తదితర బృందంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల సమక్షంలో అధునాతన, సాంకేతిక, యంత్రాలతో డ్రోన్, ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ సర్వేలను అధికారులు చేపడుతున్నారన్నారు. ఇందులో వ్యవసాయ, ప్రభుత్వ పట్టాభూములు, ఇంటి స్థలాలతో పాటు నివాస గృహాలు సైతం సర్వే చేస్తారని తెలిపారు. సర్వే చేసిన వివరాలన్నీ డిజిటలైజ్ చేయడంతో ప్రపంచంలో ఎక్కడినుంచైనా వారి భూమి వివరాలు ఆన్‌లైన్‌లో ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు చౌదరి, మండల సర్వేయర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

26, 27న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

- జెడ్పీ చైర్మన్ సహకారంతో టోర్నమెంట్ నిర్వహణ
- ప్రథమ బహుమతి రూ.30 వేలు


వాలీబాల్ కోర్టు కోసం స్థల పరిశీలన చేస్తున్న నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

చీపురుపల్లి: పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర జరగనున్న నేపథ్యంలో ఈ నెల 26, 27న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. అమ్మవారి ఆలయ సమీపంలో వాలీబాల్ కోర్టుల కోసం మంగళవారం వారు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26న సాయంత్రం 5 గంటలకు టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.25 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, నాలుగో స్థానం రూ.15 వేలు, అయిదో స్థానం రూ.10 వేలు, ఆరో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్ నిర్వహణకు అయ్యే మొత్తం ఖర్చును జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు భరించనున్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న అమ్మవారి జాతర, క్రీడా పోటీలను ప్రజలు, భక్తులు విజయవంతం చేయాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.సి.స్వరూప్, కె.మురళీధర్, అప్పారావు, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్‌చైర్మన్ సూరు కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళగిరి శ్రీను, దాలయ్య, ప్రభాత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు అద్దె కోసం వచ్చి.. చోరీ


బాధితురాలు కమల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

పాలకొండ రూరల్: ఇల్లు అద్దెకు ఇస్తారా? అంటూ ఓ ఆగంతుకుడు ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డాడు. నగర పంచాయతీలో మంగళవారం జరిగిన ఈ సంఘటన ఆందోళన కలిగించింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన మార్కెట్‌కు సమీపంలోగల ముదునూరివారి వీధిలో వైద్యుడు వడ్డే నవీన్ కుమార్ నివాసముంటున్నారు. ఇంట్లోని అందరూ పనులపై బయటకు వెళ్లగా ఆయన తల్లి కమల ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి ఇల్లు అద్దె కోసమని వచ్చి, తమవారు వస్తారని నమ్మబలికాడు. ఈ క్రమంలో తాగునీరు కావాలని ఆమెను అడగ్గా నీరు అందించేందుకు ఆమె ఇంట్లోకి వెళ్లగా వెంబడించి ఇంట్లోకి చొరబడ్డాడు. నువ్వు ఎందుకు లోపలకు వచ్చావని ఆమె ప్రశ్నించే యత్నం చేయగా అకస్మాత్తుగా ఆగంతుకుడు ఆమెను కిందకు నెట్టివేసి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కుని ఉడాయించాడు. ఈ ఘటన నుంచి తేరుకున్న బాధితురాలు జరిగిన విషయంపై తన కుమారులకు సమాచారం అందించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీ ఫుటేజ్ పరిశీలన

ఫిర్యాదు మేరకు ఎస్సై బి.శివప్రాద్ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళకు ధైర్యం చెప్పారు. ఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలపై దృష్టిపెట్టారు. క్లూస్ టీమ్, ఇతర పోలీస్ బృందాలు ఘటనపై దర్యాప్తు చేపట్టాయి.

మార్చి 7 వరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు పునశ్చరణ తరగతులు


పునశ్చరణ తరగతుల్లో భాగంగా వివిధ అంశాలపై వివరిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

విజయనగరం క్రైమ్: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ప్రతి ఏటా నిర్వహించే పునశ్చరణ తరగతులను మార్చి 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. ఈ మేరకు పునశ్చరణ తరగతులను ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోలీసు విధులను నిర్వహించినప్పుడు నిష్పక్షపాతంగా అంకిత భావం, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువకావాలని సూచించారు. విధుల్లో నైపుణ్యం సాధించేందుకు ప్రతి ఏడాది నిర్వహించే తరగతులను సద్వినియోగం చేసుకుని, శారీరక దారుఢ్యాన్ని కాపాడుకుంటూ, ఆయుధాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు.

పునరంకితం కావాలి

అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్ మాట్లాడుతూ యూనిఫాం ధరించిన తర్వాత ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణకే పోలీసులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. 15 రోజుల పాటు సాగే ఈ తరగతులతో వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులు, అవసరాల దృష్ట్యా ఆర్మ్‌డ్ పోలీసులకు వ్యక్తిత్వ వికాసాన్ని, ఆరోగ్యాన్ని, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు ప్రణాళికాయుతంగా కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వాటితో పాటు శారీరక దారుఢ్యం పెంచేందుకు, వివిధ ఆయుధాల ఉపయోగాలను, ముఖ్యమైన బందోబస్తు విధులను ఏ విధంగా నిర్వహించాలో, ఫైరింగ్ ప్రాక్టీస్, బాంబ్ స్క్వాడ్ పనితీరు ఏ విధంగా చేపట్టాలో, మస్కట్రీ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

సీఎం జగనన్నకు అండగా బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనారిటీలు


మాట్లాడుతున్న ఎస్సీక మీషన్ సభ్యురాలు ఎస్. జయమణి

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కోసం సేవలందించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా ఉంటుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి అన్నారు. ఈ మేరకు మంగళవారం పెదభోగిలి గ్రామంలోని ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కోసం తాను అందించిన సేవలను గుర్తించి తనను రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలిగా నియమించారన్నారు. అలాగే శాసన మండలిలో ఖాళీఅయిన ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే సందర్భంలో జగనన్న ప్రభుత్వానికి, పార్టీకి విధేయులుగా ఉంటూ సేవలందిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కులాల వారిని ఎమ్మెల్సీలుగా ప్రకటించడం అభినందనీయమన్నారు. ముందున్న చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారికి పదవులు దక్కకుండా చేసినప్పటికీ జగనన్న ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ వర్గాల వారికి అందలం ఎక్కించడంతో తామంతా జగనన్నకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు రామారావు, మాజీ ఎంపీటీసీ మాధవరావు పాల్గొన్నారు.

కరుణించు తల్లీ..

- పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- ఐదోజాతరకు తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన క్యూ కాంప్లెక్స్


పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం జరిగిన ఐదో జాతరలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. వేలాదిమంది భక్తుల రాకతో చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌లు కిక్కిరిసిపోయాయి. ఉదయం 10 గంటల నుంచి భక్తుల తాకిడి పెరిగింది. చదురుగుడిలో పోలమాంబ అమ్మవారిని, వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకుని, ఆలయం వెనుకున ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. గోముఖీనదీ తీరంలోని తోటల్లో వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. సాలూరు సీఐ ధనుంజయరావు, మక్కువ ఎస్ఐ జి.షైడిరాజు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ చదురుగుడి క్యూలైన్‌నువీక్షించి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు